ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 18 సంచిక: 354 | గురువారం, 21 ఆగస్ట్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com



## భారీగా పెరిగిన టమాటా ధర

తెలుగు రాష్ట్రాల్లో భారీగా పెరిగిన టమాటా ధరలు
రిటైల్ మార్కెట్‌లో 100కు చేరువలో కిలో టమాటా
మార్కెట్లో డిమాండ్‌కు సరిపడా రాని టమాటా
ఇటీవల కురిసిన వర్షా లకు దెబ్బతిన్న పంట

02



## రేవంత్ రెడ్డి ఓ చేతకాని ముఖ్యమంత్రి

యూరియా కొరతతో రైతుల నానా అవస్థలు
తక్షణమే అందించకుంటే ఉద్యమం తప్పదు
సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి హరీశ్ ఘాటు వ్యాఖ్యలు

02



# కస్టడీలో ఉంటే ఖతమే

30 రోజులు కస్టడీలో ఉంటే ప్రధాని, సీఎం పదవులు రద్దు
ఐదేళ్లకు పైగా శిక్షపడే కేసులకు ఈ నిబంధన వర్తింపు
లోక్‌సభలో కీలక బిల్లు.. విపక్షాల నిరసన
ఇది ప్రభుత్వాలను అస్థిరపరిచే కుట్ర అంటూ విపక్షాల ఆందోళన
విపక్షాల నినాదాల మధ్య లోక్‌సభ మధ్యాహ్నానికి వాయిదా

**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**

తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజుల పాటు నిర్బంధంలో ఉండే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి లేదా మంత్రులు తమ పదవిని కోల్పోయేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లులు లోక్సభలో తీవ్ర దుమారాన్ని రేపాయి. ఈ సంచలన నిబంధనలతో కూడిన బిల్లులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా బుధవారం సభలో ప్రవేశపెట్టగా, విపక్షాలు వ్యతిరేకించాయి. కనీసం ఐదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల రోజులు కస్టడీలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను చేర్చారు. వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు. దీనిని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు, జమ్ము కశ్మీర్ ..మిగతా 2లో

## బెట్టింగ్ గేమ్‌లపై ఉక్కుపాదం

డబ్బుతో ఆడే ఆన్‌లైన్ గేమ్‌లపై నిషేధం విధింపు
లోక్‌సభలో ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ బిల్లుకు ఆమోదం
నిర్వాహకులకు మూడేళ్ల వరకు జైలు, కోటి రూపాయల జరిమానా
ప్రకటనలు ఇచ్చినా రెండేళ్ల శిక్ష, రూ.50 లక్షల ఫైన్
ఈ-స్పోర్ట్స్ రంగానికి కొత్త చట్టంతో ప్రోత్సాహం

02

# హైదరాబాద్ అభివృద్ధిలో చంద్రబాబు, వైఎస్ పాత్ర

1994 నుండి 2014 వరకు వారి హయాంలోనే అభివృద్ధి
హైటెక్ సిటీని కట్టినప్పుడు అవహేళన చేశారు
నేడు సింగపూర్, టోక్యో నగరాలతో భాగ్యనగరం పోటీ
ఇప్పుడు మూసీ ప్రక్షాళనకు అడ్డుపడుతున్నారు
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

హైదరాబాద్ నగర అభివృద్ధిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రులుగా పనిచేసిన చంద్రబాబు, వైఎస్ రాజశేఖరరెడ్డిల పాత్ర ఎంతో ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 1994 నుండి 2014 వరకు హైదరాబాద్ నగరాన్ని ఆనాటి ముఖ్యమంత్రులు అభివృద్ధి చేశారని ఆయన అన్నారు. గచ్చిబౌలిలో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, హైటెక్ సిటీని నిర్మిస్తున్న సమయంలో చాలామంది అవహేళన చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరం సింగపూర్, టోక్యో నగరాలతో పోటీ పడుతోందని తెలిపారు. మన వద్ద అన్ని ఉన్నప్పుడు చిత్తశుద్ధితో పనిచేయడం చాలా అవసరమని అన్నారు. గూగుల్ వంటి దిగ్గజ సంస్థల్లో తెలుగువారు ఉన్నారని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ ..మిగతా 2లో

# మాదాపూర్‌లో 850 కోట్ల స్కాం

ఏవి సొల్యూషన్స్ మోసాల కుంభకోణం.!
3200 మందిని ముంచేసిన ఏవి సొల్యూషన్స్, ఐఐటి క్యాపిటల్స్
నకిలీ అకౌంట్లలోకి పెట్టుబడిదారుల నిధులు మళ్లింపు
ఏవి సొల్యూషన్స్ డైరెక్టర్ గడ్డం వేణుగోపాల్, శ్రీయస్ పాల్ అరెస్టులు
షెల్ కంపెనీల ద్వారా విదేశాలకు నిధుల తరలింపు



**హైదరాబాద్ బ్యూరో, ప్రజాస్వరం :**

హైదరాబాద్‌లో మరో భారీ ఇన్వెస్ట్‌మెంట్ స్కాం వెలుగుచూసింది. మాదాపూర్‌లో ఆధారంగా పనిచేసిన ఏవి సొల్యూషన్స్ , ఐఐటి క్యాపిటల్స్ పేరుతో పెట్టుబడిదారులను మోసగించిన ఘటన వెలుగులోకి వచ్చింది. సమాచారం ప్రకారం, 3200 మందికి పైగా బాధితుల నుండి ..మిగతా 2లో

# మంత్రుల తొలగింపు బిల్లుపై రాహుల్ గాంధీ స్పందన

అరెస్ట్ అయిన మంత్రులను తొలగించే బిల్లుపై తీవ్ర వివాదం
దేశాన్ని మధ్యయుగంలోకి తీసుకెళ్తోందన్న రాహుల్ గాంధీ
ఇది రాజకీయ కక్ష సాధింపులకు దారితీస్తుందని ఆందోళన
పారదర్శకత కోసమేనని స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం
ప్రస్తుతం పార్లమెంటులో బిల్లుపై కొనసాగుతున్న చర్చలు
ప్రజాస్వామ్య విలువలకు ఇది గొడ్డలిపెట్టు అన్న ప్రతిపక్షాలు

**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**

క్రిమినల్ కేసుల్లో అరెస్ట్ అయిన మంత్రులను వెంటనే పదవి నుంచి తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న బిల్లు తీవ్ర దుమారం రేపుతోంది. ఈ బిల్లు దేశాన్ని మధ్యయుగంలోకి నెట్టివేస్తుందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో ..మిగతా 2లో





# తెలంగాణ కుంభమేళాకు రూ.150 కోట్లు

మేడారం మహా జాతర కోసం కేటాయించిన ప్రభుత్వం
శాశ్వత నిర్మాణాలు, సౌకర్యాల కోసం నిధుల వినియోగం
సీఎం, డిప్యూటీ సీఎం నిర్ణయంపై మంత్రి సీతక్క స్పందన
లక్షలాది భక్తుల కోసం విశాలమైన ఏర్పాట్లు

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన మేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతరను వచ్చే ఏడాది ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేస్తూ రూ.150 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులను మేడారం మహా జాతర ఏర్పాట్లతో పాటు శాశ్వత నిర్మాణాల పనులకు వినియోగించనున్నారు. జాతరకు వచ్చే లక్షలాది భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందడుగు వేసింది. ఇక మునుపెన్నడూ లేని రీతిలో భారీగా నిధులు కేటాయించడంపై మంత్రి సీతక్క స్పందించారు. సీఎం, ..మిగతా 2లో



# పదేండ్లలో రాని సమస్య ఇప్పుడెందుకు వచ్చింది?

యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు
కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని వల్ల దయనీయ స్థితుల్లో రైతులు
ముఖ్యమంత్రి ఏమో కొరత లేదు అంటున్నాడు
ఢిల్లీలో వాళ్ళ ఎంపీలు యూరియా కోసం ధర్నాలు చేస్తున్నారు
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరో కాంగ్రెస్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా యూరియా కోసం రైతులు ఇబ్బందులు ..మిగతా 2లో



02

## కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల కౌంటర్

యూరియా సరఫరాపై కేంద్రానికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి
కేటీఆర్ వ్యాఖ్యలు అర్థరహితం.. తుమ్మల ఖండన
ప్రతిపక్ష పార్టీలపై మంత్రి విమర్శలు
రైతాంగ శ్రేయస్సు కోసం ప్రభుత్వం అండగా ఉంటుందన్న హామీ



# కస్టడీలో ఉంటే.. ఖతమే

**మొదటిపేజీ తరువాయి**

పునర్‌వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ) బిల్లులను అమిత్ షా సభ ముందు ఉంచారు. ఈ బిల్లులు కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లోని ప్రజా ప్రతినిధులకు వర్తించేలా కొత్త చట్టపరమైన నిబంధనలను ప్రతిపాదిస్తున్నాయి. ఈ బిల్లులను ప్రవేశపెట్టడాన్ని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది అధికారాల విభజన సూత్రానికి విరుద్ధమని ఆయన అన్నారు. "ఈ బిల్లుతో కార్యనిర్వాహక సంస్థలే న్యాయమూర్తిగా, జ్యూరీగా, శిక్ష అమలు చేసే వారిగా తయారవుతాయి... వాటికి అపరిమిత అధికారాలు లభిస్తాయి. ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు ఈ నిబంధనలను దుర్వినియోగం చేయవచ్చు" అని ఒవైసీ తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ కూడా ఈ బిల్లులు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్నే దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు. "నిరపరాధి అని నిరూపించుకునే వరకు ఎవరైనా నిర్దోషే అనేది మన చట్టబద్ధమైన పాలనలోని ప్రాథమిక సూత్రం. కానీ ఈ బిల్లు ఆ సూత్రాన్నే మార్చేలా ఉంది. ఇది ఒక కార్యనిర్వాహక అధికారిని ప్రధానమంత్రి కంటే ఉన్నత స్థానంలో నిలబెడుతుంది" అని ఆయన లోక్‌సభలో అన్నారు. విపక్ష సభ్యులు నినాదాలతో వెల్‌లోకి దూసుకెళ్లడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ బిల్లులను హడావుడిగా తీసుకువచ్చారని ఆరోపించారు. గుజరాత్ హోంమంత్రిగా ఉన్న సమయంలో అమిత్ షా అరెస్టయిన అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ లేవనెత్తారు. అమిత్ షా స్పందిస్తూ, బిల్లులను హడావుడిగా తీసుకురాలేదని, సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపనున్నట్లు తెలిపారు. తాను గుజరాత్ హోంమంత్రిగా ఉన్నప్పుడు అరెస్టుకు ముందే నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశానని అమిత్ షా గుర్తు చేశారు. కోర్టు తనను నిర్దోషిగా ప్రకటించాకే ప్రభుత్వంలో చేరానని తెలిపారు. విపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ స్పీకర్ సభను మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా వేశారు.

# కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల కౌంటర్

- **యూరియా సరఫరాపై కేంద్రానికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి**
- **కేటీఆర్ వ్యాఖ్యలు అర్థరహితం.. తుమ్మల ఖండన**
- **ప్రతిపక్ష పార్టీలపై మంత్రి విమర్శలు**
- **రైతాంగ శ్రేయస్సు కోసం ప్రభుత్వం అండగా ఉంటుందన్న హామీ**

తెలంగాణలో యూరియా కొరతపై కేటీఆర్ విమర్శలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కౌంటర్ ఇచ్చారు. ఈ వారంలోనే రాష్ట్రానికి అదనంగా 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలని కేంద్ర ఎరువుల మంత్రిత్వ శాఖను కోరినట్లు మంత్రి తెలిపారు. తెలంగాణ రైతాంగ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే సరఫరా చేయాలని విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్ ఎంపీలు చేపట్టిన ఆందోళన ఫలితంగా ఈ చర్యలు ప్రారంభమయ్యాయని తుమ్మల వ్యాఖ్యానించారు. కోరమాండల్ ఇంటర్నేషనల్‌కు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసి, మూడు షిప్‌మెంట్లలో యూరియా సరఫరా చేయనున్నట్టు వెల్లడించారు.యూరియా కొరతపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అర్థరహితమైనవి అని తుమ్మల తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో బఫర్ స్టాక్స్ లేకపోవడం వాస్తవం కాదని, యూరియా సరఫరాలో జరిగిన ఆలస్యానికి కేంద్ర ప్రభుత్వ జాప్యం కారణమని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలు రైతాంగాన్ని తప్పుదోవ పట్టిస్తూ, చెప్పుల క్యూ లైన్ డ్రామా లాంటి కార్యక్రమాలతో మభ్యపెడుతున్నాయని విమర్శించారు. తుమ్మల వివరాల ప్రకారం, తెలంగాణ రైతాంగానికి మొత్తం 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయింపు జరిగింది. అందులో 2.10 లక్షల టన్నుల కొరత ఇంకా కొనసాగుతుందని, ముఖ్యంగా ఈ నెలలో వినియోగం ఎక్కువగా ఉండటం వల్ల అదనంగా 80 వేల టన్నులు అవసరమవుతున్నాయని వెల్లడించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు వ్యాఖ్యలను కూడా తుమ్మల తప్పుబట్టారు. అవి రైతాంగ సమస్యలపై అవగాహన రాహిత్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. "సవాళ్లు విసరడం కాదు, సమస్యకు పరిష్కారం కనుక్కోవడమే ముఖ్యమని" తుమ్మల స్పష్టం చేశారు. రైతాంగ శ్రేయస్సు కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు.

# తెలంగాణ కుంభమేళాకు రూ. 150 కోట్లు

**మొదటిపేజీతరువాయి**



డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు. మేడారం జాతర ప్రతిష్టను మరింత పెంచేందుకు ప్రభుత్వం చూపుతున్న కృషి అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. ప్రతి రెండేళ్లకోసారి జరిగే మేడారం మహా జాతరలో లక్షలాది మంది భక్తులు దేశం నలుమూలల నుంచి తరలివస్తారు. వచ్చే ఏడాది జనవరిలో జరగబోయే జాతరకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ సారి మునుపటి కంటే మరింత విస్తృతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇదిలా ఉంటే.. ఇప్పటికే.. మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతర తేదీలను పూజారుల సంఘం అధికారికంగా ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు ఈ మహా జాతర వైభవంగా జరగనుంది. ప్రకటన ప్రకారం, జనవరి 28న సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలపై కొలువుదీరగా, జనవరి 29న సమ్మక్క తల్లి చిలకలగుట్ట నుంచి గద్దెలకు చేరుకుంటారు. జనవరి 30న భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకోగా, చివరి రోజు జనవరి 31న అమ్మవార్ల వనప్రవేశం జరుగుతుంది. మూడో రోజైన జనవరి 30న సమ్మక్క, సారలమ్మ వనదేవతలతో పాటు గోవిందరాజు, పగిడిద్దరాజుల వనప్రవేశం కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి మొక్కులు చెల్లించే ప్రధాన సందర్భంగా జాతర ఉత్సవాలు సాగనున్నాయి.

# బెట్టింగ్ గేమ్‌లపై ఉక్కుపాదం

- **డబ్బుతో ఆడే ఆన్‌లైన్ గేమ్‌లపై నిషేధం విధింపు**
- **లోక్‌సభలో ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ బిల్లుకు ఆమోదం**
- **నిర్వాహకులకు మూడేళ్ల వరకు జైలు, కోటి రూపాయల జరిమానా**
- **ప్రకటనలు ఇచ్చినా రెండేళ్ల శిక్ష, రూ.50 లక్షల ఫైన్**
- **ఈ-స్పోర్ట్స్ రంగానికి కొత్త చట్టంతో ప్రోత్సాహం**

**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**

దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఆన్‌లైన్ గేమింగ్ రంగాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. డబ్బుతో ఆడే ఆన్‌లైన్ గేమ్‌లను (రియల్ మనీ గేమింగ్) పూర్తిగా నిషేధిస్తూ రూపొందించిన 'ఆన్‌లైన్ గేమింగ్ (ప్రోత్సాహం, నియంత్రణ) బిల్లు, 2025'కు లోక్‌సభ బుధవారం ఆమోదం తెలిపింది. విపక్షాల నిరసనల మధ్యే ఈ బిల్లు పాస్ కావడం గమనార్హం. ఈ కొత్త చట్టం ప్రకారం, నిబంధనలు ఉల్లంఘించిన వారు కఠినమైన జైలు శిక్షలు, భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ బిల్లులోని నిబంధనల ప్రకారం, డబ్బుతో కూడిన ఆన్‌లైన్ గేమ్‌లను అందించడం, ప్రోత్సహించడం లేదా వాటిలో పాల్గొనడం పూర్తిగా నిషేధం. ఇలాంటి గేమింగ్ సేవలను అందించే సంస్థలకు మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా కోటి రూపాయల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అంతేకాకుండా, ఈ గేమ్‌లకు సంబంధించిన ప్రకటనలు ప్రచురించినా, ప్రసారం చేసినా రెండేళ్ల వరకు జైలు శిక్షతో పాటు 50 లక్షల రూపాయల జరిమానా విధిస్తారు. ఇలాంటి ప్లాట్‌ఫామ్‌లకు జరిపే ఆర్థిక లావాదేవీలను నిలిపివేయాలని బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలను ఈ బిల్లు సూచిస్తుంది. ఈ కఠిన నిర్ణయం వెనుక గల కారణాలను ప్రభుత్వం స్పష్టంగా వివరించింది. డబ్బు డిపాజిట్ చేయించి ఆడే ఆన్‌లైన్ గేమ్‌ల వల్ల సమాజంలో తీవ్రమైన ఆర్థిక, సామాజిక, మానసిక సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపింది. ముఖ్యంగా యువత, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు ఈ గేమ్‌ల బారినపడి సర్వస్వం కోల్పోతున్నారని ప్రభుత్వం పేర్కొంది. వారిని ఈ వ్యసనం నుంచి కాపాడేందుకే ఈ చట్టం తెచ్చినట్లు వివరణ ఇచ్చింది. అయితే, ఈ బిల్లు ఈస్పోర్ట్స్, ఎడ్యుకేషనల్ గేమ్స్, సోషల్ గేమింగ్ వంటి ఇతర ఆన్‌లైన్ గేమింగ్ విభాగాలను ప్రోత్సహించి, వాటిని నియంత్రించనుంది. ఇందుకోసం ఒక కేంద్ర నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయనున్నారు. ఈ నిర్ణయంతో ఈస్పోర్ట్స్ పరిశ్రమ హర్షం వ్యక్తం చేస్తోంది.

# హైదరాబాద్ అభివృద్ధిలో చంద్రబాబు, వైఎస్ పాత్ర

**మొదటిపేజీ తరువాయి**




చొరవతోనే ఐటీ రంగంలో చాలామంది రాణిస్తున్నారని వ్యాఖ్యానించారు. అమెరికాలో మన ఐటీ నిపుణులు పనిచేయడం ఆపేస్తే ఆ దేశం స్తంభించిపోతుందని అన్నారు. మన ప్రాంతం విద్యార్థులు ఇక్కడే చదువుకోవాలని నాటి ముఖ్యమంత్రులు పలు విద్యాసంస్థలను నిర్మించారని తెలిపారు. ఇప్పుడు మనం హైదరాబాద్ అభివృద్ధికి పాటుపడుతుంటే కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, వారిని ప్రజలే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. మూసీ నది ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం కొంతమందికి ఇష్టం లేదని ఆయన అన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి 2047 ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. మూసీ నది ప్రక్షాళనతో పాత నగరానికి పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారో అర్థం కావడం లేదని విమర్శించారు. అన్ని సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తామని చెప్పారు. నగర అభివృద్ధికి అడ్డుపడేవారు ఎవరైనా మనకు శత్రువులేనని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలతో కూడిన ఉద్యోగ భద్రతను ఇచ్చామని తెలిపారు. మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన జరగాలని ఆయన ఆకాంక్షించారు.

**17వ రోజుకు చేరుకున్న సినీ కార్మికుల సమ్మె.. సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం**

గత 17 రోజులుగా హైదరాబాద్‌లో కొనసాగుతున్న సినీ కార్మికుల సమ్మె వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వం జోక్యం చేసుకుంది. సమ్మె కారణంగా తెలుగుతో పాటు ఇతర భాషల సినిమా షూటింగులు కూడా నిలిచిపోవడంతో ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ జోక్యంతో ఈ రోజు కీలక పరిణామాలు చోటుచేసుకోనున్నాయి. హైదరాబాద్‌ను దేశంలోనే ప్రధాన సినిమా హబ్‌గా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ సమ్మె అడ్డంకిగా మారిందని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్ర సినిమా పాలసీపై కూడా ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. ఈ నేపథ్యంలో, సమస్య పరిష్కారానికి అధికారులు ఇప్పటికే ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులతో ఒక విడత చర్చలు జరిపారు. దీనికి కొనసాగింపుగా, ఈరోజు ఫెడరేషన్ నాయకులతో కూడా సమావేశం కానున్నారు. డీజీపీ సైతం ఫెడరేషన్ నేతలతో మాట్లాడనున్నట్లు తెలుస్తోంది.

# మంత్రుల తొలగింపు బిల్లుపై రాహుల్ గాంధీ స్పందన

**మొదటిపేజీ తరువాయి**

విమర్శలు గుప్పించారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, రాజకీయ కక్ష సాధింపులకు అవకాశం ఇస్తుందని ఆయన ఆరోపించారు. బుధవారం నాడు ఢిల్లీలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "అరెస్ట్ అయినంత మాత్రాన నేరం రుజువైనట్లు కాదు. కానీ ఈ బిల్లు ద్వారా ప్రభుత్వాలు తమ రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపులకు పాల్పడే ప్రమాదం ఉంది. ఇది న్యాయవ్యవస్థ స్వేచ్ఛను హరించడమే. అధికారం న్యాయాన్ని శాసించే పరిస్థితులు తలెత్తుతాయి" అని హెచ్చరించారు. అయితే, ఈ విమర్శలను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకే ఈ బిల్లును తీసుకొచ్చినట్లు స్పష్టం చేసింది. తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటూ, అరెస్ట్ అయిన వ్యక్తి మంత్రి పదవిలో కొనసాగడం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుందని ప్రభుత్వం వాదిస్తోంది. రాహుల్ గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తమ గొంతు నొక్కేందుకే కేంద్రం ఇలాంటి చట్టాలు చేస్తోందని ఆరోపిస్తున్నాయి. ప్రస్తుతం పార్లమెంటులో ఈ బిల్లుపై చర్చ జరుగుతుండగా, రాబోయే రోజుల్లో దీని భవితవ్యం తేలనుంది. ఈ బిల్లు చట్టంగా మారితే, దేశ రాజకీయాల్లో మంత్రుల అధికారాలు, బాధ్యతలపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# పదేండ్లలో రాని సమస్య ఇప్పుడెందుకు వచ్చింది ?

**మొదటిపేజీ తరువాయి**




పడుతున్నారని మండిపడ్డారు. చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల రైతులు దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఆరు నెలల ముందే ఎరువుల బస్తాలు సిద్ధంగా ఉంచేవారని, ఇప్పుడు ఒక ప్రణాళిక కూడా చేయట్లేదని ఆయన అన్నారు. అంతేకాకుండా.. కాంగ్రెస్ పార్టీ దున్నపోతు మీద వాన కురిసిన విధంగా వ్యవహరిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ఢిల్లీకి రాహుల్ గాంధీని కలవడానికి వెళ్లి రేవంత్ రెడ్డి ఏదో ఒక పేపర్ ఇచ్చి వస్తున్నారని, ఇక్కడ పోలీసులను పెట్టి ఎరువుల బస్తాలు అమ్మే పరిస్థితి వచ్చిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఊరికి పోయినా చేంతాడు అంత లైన్ కనిపిస్తుందని, ఇంత జరుగుతున్నా రాష్ట్రంలో ఎరువుల కొరత లేదు అని ప్రభుత్వం మాట్లాడుతోందని ఆయన అన్నారు. 24 గంటలు బురద రాజకీయాలు చేస్తున్నారని, మాకు మరో అనుమానం ఉందని, బ్లాక్ మార్కెట్ లో కాంగ్రెస్ నేతలు అమ్ముతున్నారు అని అనుమానం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి ఏమో కొరత లేదు అంటున్నాడని, ఢిల్లీలో వాళ్ళ ఎంపీ లు ఏమో యూరియా కోసం ధర్నా లు చేస్తున్నారని, పదేళ్లలో రాని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చిందని కేటీఆర్ ప్రశ్నించారు.

**ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎవరికి మద్దతిస్తామంటే..**

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తాము ఎవరికి మద్దతు ఇస్తామో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి సెప్టెంబర్ 9 లోపు ఎవరు 2 లక్షల టన్నుల ఎరువులు తీసుకువస్తారో ఆ పార్టీ ఉపరాష్ట్రపతి అభ్యర్థికి బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని ఆయన తేల్చి చెప్పారు.



# మాదాపూర్‌లో 850 కోట్ల స్కాం

**మొదటిపేజీ తరువాయి**

సుమారు 850 కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. పెట్టుబడులు అన్నీ సురక్షితంగా ఉంటాయని, స్టాక్ మార్కెట్‌లో పెట్టితే అధిక లాభాలు వస్తాయని మాయమాటలు చెప్పి డిపాజిటర్లను ఆకర్షించారు. పెట్టుబడిదారుల నుండి సేకరించిన డబ్బును నిజమైన పెట్టుబడులుగా మార్చకుండా, నకిలీ అకౌంట్లలోకి మళ్లించారు. స్టాక్ మార్కెట్‌లో బలమైన కంపెనీల ద్వారా లాభాలు వస్తాయని ప్రచారం చేసినప్పటికీ, వాస్తవానికి మొత్తం మోసపూరిత కార్యకలాపమేనని అధికారులు ధృవీకరించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఏవి సొల్యూషన్స్ డైరెక్టర్ గడ్డం వేణుగోపాల్ను పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే ఐఐటి క్యాపిటల్ టెక్నాలజీస్ ఎం.డి శ్రియస్ పాల్ను కూడా అదుపులోకి తీసుకున్నారు.ఏవి సొల్యూషన్స్‌కి అనుబంధంగా దాదాపు 10 షెల్ కంపెనీలు ఏర్పాటు చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కంపెనీల ద్వారా దేశంలో సేకరించిన నిధులను విదేశాలకు తరలించినట్లు అధికారులు గుర్తించారు. ఏవి సొల్యూషన్స్, శ్రీనివాస అనలిటిక్, ట్రేడ్బుల్ టెక్నాలజీ, ఐఐటి క్యాపిటల్ టెక్నాలజీ పేర్లతో డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. ఈ సంస్థలు తమను BSE, SEBI లో నమోదు అయిన కంపెనీలుగా ప్రచారం చేసుకొని ప్రజలను నమ్మించారు. కానీ వాస్తవానికి పెట్టుబడులు అన్నీ మోసపూరిత పథకాలే. పలు రాష్ట్రాల్లో కూడా ఈ కంపెనీలు ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు తెలుస్తోంది.

# భారీగా పెరిగిన టమాటా ధర..

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలుగు రాష్ట్రాల్లో టమోటా ధరలు భారీగా పెరుగుతున్నాయి. వారం క్రితం వరకు కిలో 20 నుంచి 30 రూపాయలు పలికిన కిలో టమాటా ధర ఇప్పుడు భారీగా పెరిగింది. గత 15 రోజుల్లో టమాటా ధర డబుల్ అయిపోయింది. ప్రస్తుతం హోల్ సేల్ మార్కెట్‌లో కిలో టమాటా 60 నుంచి 70 రూపాయలు పలుకుతుంది. కాగా, డిమాండ్‌కు సరిపడ టమాటా రాకపోవడమే ఇందుకు కారణమని కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు. ఇక, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు టమాటా పంటలు దెబ్బతిన్నాయని.. దీంతో ధరలు అమాంతం పెరిగాయని పేర్కొంటున్నారు. అయితే, గత 10 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల దెబ్బకు టమాట పంట నాశనం అయింది. దీంతో హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు జిల్లాలు, రాయలసీమ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా వచ్చే టమాటా పంట దిగుబడి కూడా ఆగిపోవడంతో ధరలు పెరిగినట్లు కూరగాయల వ్యాపారులు పేర్కొంటున్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం లాంటి నగరాల్లో కేజీ టామాట ధర రూ. 50 నుంచి 60 వరకు పలుకుతుంది. ఇక, మిగతా జిల్లాల్లో 35 45 వరకు పలుకుతుంది. మరికొన్ని రోజుల పాటు అతి భారీ వర్షాలు, వరదలతో టామాట పంట తీవ్రంగా దెబ్బ తింది. మార్కెట్లకు సరఫరా గణనీయంగా తగ్గిపోవడంతో రేట్లు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

# రేవంత్ రెడ్డి ఓ చేతకాని ముఖ్యమంత్రి

- **యూరియా కొరతతో రైతులు నానా అవస్థలు**
- **సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి హరీశ్ ఘాటు వ్యాఖ్యలు**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన రైతుల సమస్యలపై ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హరీష్ రావు విమర్శించారు. "రైతులకు కంటి నిండా నిద్ర పట్టడం లేదు.. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం కుంభకర్ణుడిలా నిద్రిస్తున్నారు" అని ఆయన మండిపడ్డారు. రైతులకు కావలసిన యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. "51 సార్లు ఢిల్లీ వెళ్లిన రేవంత్ రెడ్డి ఒక్క యూరియా బస్తా కూడా తెచ్చే దమ్ములేదు. రైతులకు న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది" అని హరీష్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ పాలనలో రైతుల పాదాలను గోదావరి జలాలతో కడిగారని గుర్తుచేస్తూ.. "ఇప్పుడు రైతులను పోలీసుల కాళ్లు మొక్కించే పరిస్థితి తెచ్చింది రేవంత్ ప్రభుత్వం" అని ఆయన తీవ్ర స్థాయిలో దుయ్యబట్టారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఢిల్లీలో ఉన్నా రైతుల కోసం ఏమాత్రం కృషి చేయలేదని, రైతుల సమస్యలను పట్టించుకోవడంలో విఫలమయ్యారని హరీష్ ఆరోపించారు. "ఏ ఎన్నికలు పెట్టినా రైతులే కాంగ్రెస్ కు గుణపాఠం చెపుతారు" అని ఆయన హెచ్చరించారు. తక్షణమే రైతులకు యూరియా అందించకపోతే బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని హరీష్ స్పష్టం చేశారు.



# అక్టోబర్12న 'జంగ్ సైరన్'

- **ఎస్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్**

**మెదక్ ఆగస్టు 20 (ప్రజా స్వరం) :**

అక్టోబర్ 12 న లక్ష మంది ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ లతో చలో హైదరాబాద్ పేరిట జంగ్ సైరన్ నిర్వహిస్తున్నట్టు ఎస్టీయుటిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ అన్నారు. మెదక్ లో బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడం లో విఫలమైందన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలనీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఒప్పందం మేరకు ప్రతి నెల 700 కోట్లు విడుదల చేస్తానని చెప్పి మోసం చేసిందన్నారు.. పెండింగ్ లో ఉన్న 5 డీ ఏ లు విడుదల చేయాలని, అదేవిధంగా పీ ఆర్ సి నివేదిక తెప్పించుకొని 51 శాతం ఫిట్ మెంట్ తో 1 జూలై 2023 నుండి అమలు చేయాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ సమస్యల సాధన కోసం రాష్ట్ర స్థాయిలో 1 లక్ష మంది ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ ల తో అక్టోబర్ 12 చలో హైదరాబాద్ పేరిట లక్ష మంది ఉపాధ్యాయులతో జంగ్ సైరన్ కార్యక్రమం నిర్వహణ ను ఏర్పాటు చేసి హక్కులు సాధించుకోవడానికి ఉద్యమ కార్య చరణ చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ గౌడ్, కిష్టయ్య, జబ్బార్, అరుణ్, దిలీప్, వేణుగోపాల్, మహేశ్వర్, ఎల్లం, రవి, రావి నాయక్, మల్లేష్, శ్రీధర్, దుర్గా రాములు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 900 మెట్రిక్ టన్నుల యూరియా

**పది రోజుల్లో ఇంకో 1500 మెట్రిక్ టన్నులు**
**రైతులు అవసరం మేరకే యూరియా కొనుగోలుచేయాలి**
**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్, ఆగస్టు 20 (ప్రజా స్వరం) :**

జిల్లా లో ఎక్కడ యూరియా కొరత లేకుండా అధికారులు ప్రతీ రోజూ క్షేత్ర స్థాయి పర్యవేక్షణ చేయాలనీ జిల్లా కలెక్టర రాహుల్ రాజ్ అన్నారు బుధవారం టేక్మాల్ మండల కేంద్రంలోని తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని, పాపన్నపేట మండలం లక్ష్మీ నగర్ గ్రామంలోని ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రం కలెక్టర్ పరిశీలించారు. విక్రయదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు స్టాకు నమోదును అధికారులతో కలిసి పరిశీలించారు. ఎరువుల రైతులతో మాట్లాడారు. కేవలం యూరియా నే కాకుండా నత్రజని ఆధారిత కాంప్లెక్స్ ఎరువులను, నానో యూరియాను కూడా వాడవలసిందిగా సూచించారు. ఎరువుల గురించి ఆందోళన చెందరాదని సమృద్ధిగా నిలువలు ఉన్నట్లు తెలియజేశారు కొద్దిమంది కావాలని వదంతులు సృష్టించడం ద్వారా రైతులు సెప్టెంబర్ లో కొనవలసిన యూరియా కూడా ఇప్పుడే కొనడానికి షాపులు దగ్గర రావడంతో రద్దీ పెరుగుతుందని అలానే వదంతులు నమ్మవద్దని వచ్చే పది రోజుల్లో ఇంకా 1500 మెట్రిక్ టన్నుల యూరియా మన జిల్లాకు రావడానికి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని తెలిపారు. సెప్టెంబర్ లో కూడా మన అవసరానికి తగ్గట్టు 4000 మెట్రిక్ టన్నుల యూరియా వ్యవసాయ శాఖ నుండి మన జిల్లాకు తప్పకుండా పంపడం జరుగుతుందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ తెలిపారని అన్నారు. యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, యూరియా రెండు రోజులకోసారి వస్తుందని వారి విస్తీర్ణాన్ని బట్టి మళ్ళీ తీసుకోవచ్చని



రైతులకు తెలియజేశారు. ప్రతి రైతు అవసరాలను బట్టి కొనుగోలు చేయాలన్నారు. ఒకే షాప్ దగ్గర క్రౌడ్ కాకుండా రైతులు ఇబ్బంది పడకుండా యూరియా కొనుగోలు చేసుకునేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాగే సాగు కి సరిపడా యూరియా అమ్మకం పూర్తి అయ్యే వరకు వ్యవసాయ, స్పెషల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. ఏ మండలం లో ఎంత స్టాక్ ఉందనే సమాచారం రైతులకు తెలపాలన్నారు ఎవరికైన ఇబ్బంది కలిగితే మండల వ్యవసాయ అధికారి లేదా విస్తరణ అధికారిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యాలకు మన జిల్లా ప్రతీక

- **గణేశ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి**
- **మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్**
- **పర్యావరణహిత మట్టి గణపతులను వాడండి**
- **గణేష్ మండపాలు వద్ద డిజె సౌండ్ నిషేధం**
- **ఎస్పీ శ్రీనివాస రావు**




**మెదక్, ఆగస్టు 20 (ప్రజా స్వరం) :**

మతసామరస్యాలకు ప్రతీకగా జిల్లాలో గణేష్ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం మెదక్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు, అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, డిఆర్ఓ భుజంగరావు, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి డీఎస్పీలు సంబంధిత జిల్లా అధికారులు తాసిల్దార్లు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా ఉత్సవ కమిటీ సభ్యులు వివిధ శాఖల అధికారులు గణేశు ఉత్సవాలకు సంబంధించి ఆయా శాఖల ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలు, గతంలో ఏర్పడిన సమస్యలు, ఇంకా మెరుగైన ఏర్పాట్లపై స్వయంగా అడిగి తెలుసుకోవడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా జిల్లాలో గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరు సహకరించాలని ఈనెల 27 నుంచి జరిగే గణేష్ ఉత్సవాలను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వినాయక విగ్రహాలు ఎత్తు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపాలిటీ పోలీస్ సమన్వయంతో జిల్లాలో గణేష్ మండపాల ఏర్పాటు ప్రదేశాలను ముందే గుర్తించి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు గణేష్ విగ్రహాలు నెలకొల్పేటప్పుడు, విగ్రహాల నిమజ్జనం చేసేటప్పుడు ఊరేగింపు చేయి విషయాల్లో విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ముందస్తుగా విద్యుత్ అధికారులు ప్రణాళిక బద్ధమైన చర్యలు చేపట్టాలన్నారు. వైన్ షాపులు బందు పెట్టే విషయంలో ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ జిల్లా పంచాయతీ శాఖ ద్వారా శానిటేషన్ పై దృష్టి సారించాలన్నారు.జిల్లాలో ప్రతి మండలంలో గ్రామాలలో జరిగే వినాయక మండపాల సమగ్ర సమాచారం పంచాయతీ సెక్రటరీలు ప్రణాళిక పొందించాలన్నారు. నిమజ్జనం రోజున అవసరమైన ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని ఆదేశించారు. గుంతలు పడిన రోడ్లను మరమతులు చేయించాలని తెలిపారు. మునిసిపల్, రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టణ ప్రధాన రహదారితో పాటు గణేష్ మార్గ్‌ను పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. ఉత్సవాల నిర్వహణపై ఆర్డీవోలు డీఎస్పీలతో స్థానికంగా సమావేశాలు నిర్వహించాలని, పారిశుధ్యం, తాగునీరు తదితర విషయాలను పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారి చూడాలని, బ్లీచింగ్ పౌడర్ ఏర్పాటు, బోర్డుకు చిన్నచిన్న గుంతలు పూడ్చడం వంటి వాటిపై దృష్టి సారించాలని, శాంతియుత వాతావరణంలో వినాయక ఉత్సవాలు నిర్వహించేలా చూడాలన్నారు. జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు మాట్లాడుతూ గణేష్ మండపాల ఏర్పాటు విషయంలో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, డిజె సౌండ్ సిస్టం పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. పోలీస్ యంత్రాంగం పటిష్ట భద్రత కల్పిస్తుందని నిమజ్జన సమయంలో భక్తులు సమన్వయం పాటించాలని పోలీసు వారికి సహకరించాలన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి



**పరిగి, ఆగస్టు 20 (ప్రజాస్వరం):**

వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పరిగి ఎమ్మెల్యే డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకుని,యువతకు ప్రేరణగా నిలిచిన నాయకుడిగా గుర్తు చేసుకున్నారు. రాజీవ్ గాంధీ సూచించిన మార్గంలో కాంగ్రెస్ నాయకులు దేశ అభ్యున్నతికి పాటుపడాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు.



# పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అన్నధానం

**శామీర్ పేట, ఆగస్టు 20 (ప్రజాస్వరం) :**

శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ఘనంగా అన్నదానం చేపట్టారు. బుధవారం శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్ ఉప్పర్ పల్లి పరిధిలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద జగదేవపూర్ కు చెందిన జుర్రు ముత్తయ్య యాదవ్ బాలమణి దంపతులు, కుమారుడు జుర్రు వెంకటేష్ యాదవ్ స్రవంతి దంపతులు, కుమారులు తనీష్ యాదవ్, శ్రీచరణ్ యాదవ్ వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

# రూ.26 కోట్లతో ఆస్పత్రి

**భూమి పూజ చేసిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**



**వికారాబాద్, ఆగస్టు 20(ప్రజా స్వరం):**

వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో రూ.26కోట్లతో నిర్మించనున్న ఆసుపత్రికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ,జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిగి ఎమ్మెల్యే డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. ఏరియా ఆసుపత్రికి కొత్త భవనం నిర్మిస్తే పరిగి ప్రాంతంలోని పేద రోజులకు ఇంకా మెరుగైన చికిత్స లభిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ఇతోధికంగా కృషి చేస్తుందన్నారు. అనంతరం పరిగి పట్టణంలో తహసీల్దార్ తాత్కాలిక



కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ,జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి,అధికారులు మరియు ప్రజాప్రతినిధులతో కలిసి పరిగి ఎమ్మెల్యే డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు.



# మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట

- **నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం**
- **పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**

**పరిగి, ఆగస్టు 20 (ప్రజాస్వరం):**

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం దోమ మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా శిక్షణ పొందిన మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 35 మంది మహిళలకు ఉచిత కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. అలాగే మరియు సర్టిఫికెట్లను స్థానిక నాయకులు,అధికారులతో కలిసి పరిగి ఎమ్మెల్యే, డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం దోమ గ్రామానికి చెందిన మరియు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 99 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ ను ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అందించడం జరిగింది.

**మహిళలకు ఉచిత కుట్టుమిషన్లను పంపిణీ**

కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా శిక్షణ పొందిన మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 35 మంది మహిళలకు ఉచిత కుట్టుమిషన్లను మరియు సర్టిఫికెట్లను స్థానిక నాయకులు,అధికారులతో కలిసి పరిగి ఎమ్మెల్యే, డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 47 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్లను అందించారు. అలాగే మండలంలోని పలు గ్రామాలకు చెందిన 27 మంది లబ్ధిదారులకు మంజూరు అయిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందించారు.



# అధ్యాపకులకు డాక్టరేట్ ప్రధానం

**శామీర్ పేట, ఆగస్టు 20 (ప్రజాస్వరం) :**

తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఐదుగురు అధ్యాపకులు డాక్టరేట్ పట్టాలను అందుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం 84వ స్నాతకోత్సవ కార్యక్రమం హైదరాబాదులోని ఠాగూర్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శామీర్ పేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్టకు చెందిన ఐదుగురు అధ్యాపకులకు వివిధ విభాగాలలో పరిశోధనలు చేసినందుకుగాను రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ వి నారాయణన్, వైస్ ఛాన్సలర్ ప్రొ.కుమార్ చేతుల మీదగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. డాక్టర్ వి.స్రవంతి(తెలుగు), డాక్టర్ కీర్తి (జువాలజీ), డాక్టర్ అనిత (కెమిస్ట్రీ), డాక్టర్ లక్ష్మీప్రసన్న (స్టాటస్టిక్స్), డాక్టర్ హైమావతి (ఫిజికల్ ఎడ్యుకేషన్) విభాగాల్లో డాక్టరేట్ అవార్డును అందుకున్నారు. డాక్టరేట్ పట్టాలను సాధించినందుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చేతన, అధ్యాపకులు, విద్యార్థినులు డాక్టరేట్ పొందిన అధ్యాపకులకు అభినందనలు తెలియజేశారు.

# బీసీ రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం కాదు


## బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

**వికారాబాద్, (ప్రజాస్వరం) :**
వికారాబాద్‌లో తెలంగాణ బిజెపి చీఫ్ ఎన్.రామచందర్ రావు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తే వికారాబాద్ జిల్లాను అనంతగిరి జిల్లాగా మారుస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న అనంత పద్మనాభ స్వామి ఆలయానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా జిల్లా పేరును మారుస్తామని తెలిపారు. బీసీ రిజర్వేషన్లకు బిజెపి ప్రభుత్వం వ్యతిరేకం కాదని తెలంగాణ బిజెపి ఎన్ రామచందర్ రావు పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లాలో మంగళవారం తొలిసారి పర్యటించిన బిజెపి చీఫ్‌కు వికారాబాద్ జిల్లా బిజెపి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిందిస్తుందని విమర్శించారు . రాష్ట్రానికి కావలసిన యూరియాను కేంద్ర ప్రభుత్వం సమర్ధంగా పంపిణీ చేస్తుందని వివరించారు. సాగునీటి రంగంలో వికారాబాద్ జిల్లా వెనుకబడి ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులు భారీ వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వికారాబాద్ జిల్లాలో భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని












## కత్తి పుష్పలత డాక్టరేట్

**శామీర్‌పేట, ఆగస్టు (ప్రజాస్వరం) :**
అలియాబాద్ మున్సిపాలిటీ లల్ గాడి మలక్ పేట్ చెందిన కత్తి పుష్పలత భర్త కత్తి యాదగిరిఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన 84వ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మెన్ నారాయణ్ ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ కుమార్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. గణితంలో నుమరికల్ స్టడీ ఆఫ్ ఎమ్ హెచ్ డి డార్సీ ఫోర్చ్మర్ ఫ్లో ఆఫ్ నాన్ న్యూటనియన్ నానో ఫ్లూయిడ్స్ అనే అంశం మీద గైడ్ ప్రొఫెసర్ బండారి శంకర్ పర్యవేక్షణలో ఉస్మానియా విశ్వవిద్యాలయం లో పరిశోదన పూర్తి చేసినందుకు గాను పుష్పలత డాక్టరేట్ ను అందుకున్నారు. కనీసం బస్సు సౌకర్యం లేని సిద్దిపేట జిల్లా శేరిపల్లి బందారం గ్రామంలో బీద కుటుంబానికి చెందిన తను పూర్తిగా ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి, ప్రభుత్వ కళాశాలలో ఇంటర్, డీగ్రీ, బిఎడ్ చదివి, చిన్నప్పటినుండి గణితంలో మక్కువ ఉండటంతో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ర్యాంక్ సాధించి పీజీ గణితం చదివి, పీహెచ్డీ గణితంలో చేరి పరిశోదనలు చేశారు. పీహెచ్డీ లో చేరిన తర్వాత తండ్రి మరణం, ఆ బాధను దిగ మింగుకొని ఇంటికి పెద్దదికై వ్యవసాయ పనులు చేస్తూ, పరిశోదనలు చేస్తూ, హోమ్ ట్యూషన్లు చెప్పుతూ కుటుంబాన్ని పోషిస్తూ, తమ్ముళ్లను, చెల్లెల్ని చదివిస్తూ, తను ప్రభుత్వ ఉద్యోగం కోసం చదివి 2019సం"లో బీసీ వెల్ఫేర్ లో జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సాధించారు. అదే సంవత్సరం(2019)లో సోషల్ వెల్ఫేర్ గురుకుల డీగ్రీ కళాశాలలో ప్రభుత్వ డీగ్రీ లెక్చరర్ గా ఉద్యోగం సాధించారు. ఉద్యోగం చేస్తూ, పరిశోదనలు చేస్తూనే కష్టాలను భరిస్తూ తమ్ముని పెళ్లి చెల్లి పెళ్లి చేసి చివరగా తను పెళ్లి చేసుకొని మలక్ పేట్ కు కోడలిగా వచ్చి ఉపాధ్యాయుల, తల్లిదండ్రులు భర్త సహకారంతో పరిశోదనలు పూర్తి చేసి డాక్టరేట్ సాధించడం పట్ల, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు, గ్రామస్తులు పుష్పలతను అభినందించారు.

## విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న మధుకృష్ణ



**శామీర్‌పేట, ఆగస్టు 20 (ప్రజాస్వరం) :**
మూడుచింతలపల్లి మున్సిపాలిటీ, మూడుచింతలపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రోజున జరిగిన శ్రీ కంఠమహేశ్వర స్వామి సూరమాంబదేవివిగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో యువనాయకుడు క్యాతం మధుక్రిష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ చల్లగా ఉండాలని, అతి వృష్టి అనావృష్టి రాకుండా వాతావరణం సమతుల్యం వుండేలా అమ్మవారి దీవెనలు ఉండాలని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేయడం వలన గ్రామములో భక్తి భావం పెరిగి చెడు వ్యసనాలకు దూరముగా ఒకరిపై ఒకరికి ఈర్ష్య ద్వేషాలు లేకుండా అందరు సత్ప్రవర్తన తో వుంటారని తెలిపారు. గౌడ సంఘం నాయకులు మధు క్రిష్ణను శాలువాతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ప్రతిష్టను ఇంత ఘనంగా నిర్వహించినందుకు గౌడ సంఘం ప్రతినిధులను అభినందించారు. వారికీ సహకరించిన గ్రామ పెద్దలకు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఉచిత వైకుంఠ రథం ప్రయాణించిన తోటకూర వజ్రేష్

**శామీర్‌పేట, ఆగస్టు 20(ప్రజాస్వరం) :**
తూంకుంట మున్సిపల్ పరిధిలోని శామీర్ పెట్ లో మాజీ ఎంపీటీసీ డప్పు సాయిబాబా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారి తండ్రి కీ.శే బిక్షపతి జ్ఞాపకార్ధంగా బుధవార ఉచిత వైకుంఠ రథం మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ తదితరులు హాజరై ఉచిత వైకుంఠ రథం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మాజీ ఎంపీటీసీ డప్పు సాయిబాబా తండ్రి జ్ఞాపకార్ధం ఉచిత వైకుంఠ రథం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువకులు ఇటువంటి సేవ కార్యక్రమాలు చేపట్టాలని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, రాష్ట్ర హజ్




కమిటీ మెంబర్ మహమ్మద్ ముజీబుద్దీన్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రిజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, శామీర్ పెట్ మాజీ సర్పంచ్ కిషోర్ యాదవ్, ఆలియాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి, మేడ్చల్ ఏఎంసీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, సీనియర్ నాయకుడు తుంకి మల్లేష్, వంగ నర్సింహారెడ్డి, ఐలయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**శామీర్‌పేట, ఆగస్టు 20 (ప్రజాస్వరం) :**
మూడుచింతలపల్లి మండల కేంద్రంలో బుధవారం నాడు కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, మూడుచింతలపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మలపల్లి నరసింహులు యాదవ్ మాట్లాడుతూ అనేక సంస్కరణలను తీసుకువచ్చి దేశాన్ని అగ్ర పదంలో ఉండేలా చేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి, దోసకాయల వెంకటేష్, వేణుగోపాలరావు, మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఇర్రి రవీందర్ రెడ్డి, దేవాలయ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మూడుచింతలపల్లి మున్సిపాలిటీ యూత్ అధ్యక్షులు శ్రీకాంత్, జగ్రిపోతుల నర్సింహులు, మూడుచింతలపల్లి మున్సిపాలిటీ సేవాదల్ అధ్యక్షులు జాఫర్, పోతారం గ్రామ శాఖ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, నారాయణపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు మహేష్, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

## రాజీవ్ సేవలు మరువలేనివి



**మనోహరాబాద్, (ప్రజాస్వరం) :**
దివంగత ప్రధాని భారతరత్న శ్రీ రాజీవ్ గాంధీ 81వ జయంతి వేడుకలను రాష్ట్ర మాజీ పీసిసి రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రీజినల్ కన్వీనర్ కనిగిరి లింగం ఆధ్వర్యలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సీహెచ్ సాయి కుమార్, బీ సత్తయ్య యాదవ్, అరవండి రాజు తదితరులున్నారు.



## సిఐఆర్ హెడ్ క్వార్టర్ ను సందర్శించిన పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ

**సిద్దిపేట, ప్రజాస్వరం**

పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ నూతనంగా నిర్మించిన సిఐఆర్ హెడ్ క్వార్టర్ ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆవరణ లో నూతనంగా నిర్మించిన సిఏఆర్ హెడ్ క్వార్టర్ సందర్శించి మిగిలిన చిన్న చిన్న పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని హౌసింగ్ బోర్డ్ ఏఈ సుధాకర్ మరియు పోలీస్ అధికారుల కు సూచించారు. సిఏఆర్ హెడ్ క్వార్టర్ సువిశాలంగా 10,000 ఎస్ఎఫ్టి తో నిర్మించడం జరిగిందన్నారు, గ్రౌండ్ ఫ్లోర్ లో ఆయుధాల గది, స్టోర్ రూమ్, ఎంటిఓ ఆఫీస్, వర్క్ స్టేషన్, ఆర్ఐ అడ్మిన్ రూమ్స్ కలవు. 10,000 ఎస్ఎఫ్టి ఫస్ట్ ఫ్లోర్ లో ఏఆర్ అడిషనల్ డీసీపీలు ఛాంబర్స్, నాలుగు ఆర్ఐ చాంబర్స్, ఆర్ఎస్ఐ వర్క్ స్టేషన్స్, ఉమెన్ రెస్ట్ రూమ్, అధికారులందరి వర్క్ స్టేషన్ తో విశాలంగా నిర్మించడం జరిగింది దాదాపు నిర్మాణం పూర్తయింది చిన్న చిన్న పనులు ఉంటే త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులకు కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు పూర్ణచందర్, ధరణి కుమార్, కార్తీక్, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, సీసీ నితిన్, రాష్ట్ర పోలీస్ సంఘము ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రుల ఉత్సవాలకు పర్మిషన్ తీసుకోవాలి

- **ఎస్సై అభిలాష్**

**కోహెడ, ప్రజాస్వరం**



గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు తెలంగాణ పోలీస్ శాఖ రూపొందించిన policeportal.tspolice.gov.in పోర్టల్ లో ఉత్సవ కమిటీలు దరఖాస్తు చేసుకోవాలని కోహెడ ఎస్సై అభిలాష్ ఒక ప్రకటనలో అన్నారు. గణేష్ మండప నిర్వాహకులు ఆన్లైన్లో అనుమతి ప్రక్రియ తొందరగా పూర్తి చేసుకోవాలని,ప్రమాదాలు జరగకుండా విద్యుత్తు ఇతర జాగ్రత్తలు తీసుకోని నిమజ్జనం అయ్యే వరకు మండపాల వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా ఉండాలని మండపాల వద్ద పెట్టే సౌండ్ సిస్టం ద్వారా ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దని సూచించారు. నిమజ్జనం సమయంలో ఎక్కడ కూడా డీజేలు పెట్టొద్దని అన్నారు. పండగను భక్తి శ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో 100 డయల్ కి సమాచారం ఇవ్వాలని సూచించారు.



## బోధనకు దూరం చేసేందుకే పరీక్షా విధానంలో మార్పులు

- **యుటియఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ఆరోపణ.**

**బద్వేలు, ప్రజాస్వరం**

ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసేందుకే పరీక్ష విధానంలో మార్పులు చేపట్టి, బుక్ లెట్ అసెస్మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టారని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ఆరోపించారు. బుధవారం ఉదయం జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో డీఈఓ షేక్ శంషుద్దీన్ ను కలిసి ఉపాధ్యాయులను బోధ నేతర పనుల నుండి పూర్తిగా మినహాయించాలని, ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షల విధానాన్ని పాత పద్ధతిలోనే నిర్వహించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం, శిక్షణా తరగతుల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేశారని, ఇవి కాకుండా ప్రతీరోజూ ఏదో ఒక సమాచారం విద్యాశాఖ అత్యవసరమంటూ యాప్ లలో అప్లోడ్ చేయమంటున్నదని తెలిపారు. విద్యా కిట్లు పంపిణీ అప్లోడ్ చేయాలంటూ ఒత్తిడి సరేసరని, యాప్ ల భారం తగ్గిస్తామని చెబుతూనే ఒకే యాప్ లో అనేక సమాచారాలు పెట్టమంటున్నారని క్రిందిస్థాయి అధికారుల ఒత్తిడి తట్టుకోలేక పోతున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన ఫార్మేటివ్ అసెస్మెంట్లో సిలబస్ లో లేని ప్రశ్నలను ఇచ్చి విద్యార్థులను గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టడంతో పాటు మా ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు పరీక్షల్లో రావనే అపవాదు వస్తున్నదని తెలిపారు.ఒకటో తరగతి విద్యార్థులు పేరాగ్రాఫ్ చదివి ప్రశ్నలకు జవాబులు తెలియజేయమనడం వారి స్థాయిని దృష్టిలో ఉంచుకోకుండా వ్యవహరించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు అందజేసిన అసెస్మెంట్ పుస్తకాలలో విద్యార్థుల కన్నా ఉపాధ్యాయులకే ఎక్కువ రాత పని ఉండేవిధంగా తయారు చేశారని, వందల మంది విద్యార్థులు ఉన్నచోట ఒక ఉపాధ్యాయుడు ఇలాంటి కార్యక్రమాలు ఎలా నిర్వహించాలో అర్థం కాని గందరగోళ పరిస్థితులలో ఉపాధ్యాయులు పూర్తిగా బోధనకు దూరమవుతున్నారని తెలిపారు. పరీక్షలు విద్యార్థులు రాస్తున్నారా? ఉపాధ్యాయులు రాస్తున్నారా? అన్న ప్రశ్న నేడు పాఠశాలల్లో నెలకొని ఉందని, అసంబద్ధ నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలలను ప్రయోగశాలలుగా మార్చడం సరికాదని, విద్యా రంగంలో ఇదే విధానం కొనసాగితే భవిష్యత్తులో ఉపాధ్యాయులు బోధనకు పూర్తిగా దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. పరీక్ష విధానం పాత పద్ధతిలోనే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్ నాయకులు సుబ్బారావు, వీరనారాయణ, గోపీనాథ్, శివకుమార్ రాజు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.





# రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి

- **సాంకేతిక రంగానికి పునాది వేసిన రాజీవ్ గాంధీ..**
- **ప్రపంచదేశాల్లో దేశాన్ని బలమైన శక్తిగా మార్చడానికి రాజీవ్ కృషి**
- **ప్రజాస్వామ్య దేశానికి పంచాయతీ రాజ్ సంస్థలు అవసరమని గుర్తించి వాటిని తీర్చిదిద్దిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ..**
- **రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**జయశంకర్ భూపాలపల్లి,ప్రజాస్వరం**

భారతదేశాన్ని ఆధునిక దిశగా తీసుకెళ్లిన దూరదృష్టి కలిగిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని, ప్రపంచదేశాల్లో దేశాన్ని బలమైన దేశంగా చేయడానికి రాజీవ్ చేసిన కృషి, సేవలు మరువలేనివని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 81వ జయంతి సందర్భంగా భూపాలపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలిసి పాల్గొన్నారు. ముందుగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కేకు కోసి వేడుకలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... దేశానికి సమాచార, సాంకేతిక రంగానికి పునాది వేసిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. యువతకు శక్తి ఇచ్చిన నాయకుడిగా రాజీవ్ గాంధీ ఎప్పటికీ అందరికీ గుర్తుండిపోతారన్నారు. రాజీవ్ గాంధీ టెలికమ్యూనికేషన్, రక్షణ, వాణిజ్య, విమానయాన సంస్కరణలు ప్రవేశపెట్టారని అన్నారు. విద్యావకాశాల సమానత్వం కోసం నేషనల్ పాలసీ ఫర్ ఎడ్యుకేషన్ ను తీసుకొచ్చినట్టు గుర్తుచేశారు. యువత ప్రయోజనాలే లక్ష్యంగా ఐటీ, విద్య రంగాల్లో సంస్కరణలు తీసుకొచ్చిన రాజీవ్ గాంధీ రాజకీయాల్లో కూడా వారి భాగస్వామ్యాన్ని పెంచేందుకు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. 61వ రాజ్యాంగ సవరణతో ఓటేసేందుకు కనీస వయసు 21 నుండి 18 ఏళ్లకు తగ్గించిన నాయకుడు రాజీవ్ గాంధీ అని ఎమ్మెల్యే అన్నారు. 91 పార్లమెంట్ ఎన్నికల్లో 40 శాతం టికెట్లను యువతకు కేటాయించి తాను మాటలకారి కాదని, చేతల్లో చూపిస్తానని రాజీవ్ గాంధీ నిరూపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

# శ్రీకాకుళం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పర్యటన

**శ్రీకాకుళం, ప్రజాస్వరం**



దేశానికి ఎంతో గర్వకారణంగా శ్రీకాకుళంలో ఏర్పాటు చేసిన గాంధీ స్మృతి వనం నిలుస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం తొలిసారిగా నగరంలో ఉన్న గాంధీ మందిరాన్ని సందర్శించి.. అక్కడ చాయ్ పే చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీకాకుళం గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధులు సంఘసంస్కర్తల స్మృతి వనాన్ని ఒక అపురూప వనంగా వర్ణించారు.. ముందుగా బాపూజీకి పూలమాలవేసి రఘుపతి రాఘవ రాజారామ్ కీర్తన గాంధీ మందిరం బృందంతో పాటు ఆలపించారు. బాపూజీ స్ఫూర్తి విశ్వవ్యాప్తంగా ప్రజ్వరిల్లుతో0దని, తనకు ఈ స్మృతి వనంలో అడుగుపెట్టినప్పుడు నుంచి తెలియని భావోద్వేగం దేశభక్తి రెట్టింపు అవుతోందని మాధవ్ అన్నారు. దేశంలోని ఎక్కడా లేని ఒక చారిత్రక నిర్మాణాన్ని చేపట్టి సమాజానికి అందించిన నిర్వాహకులు దాతలు ప్రజలను సమాజాన్నికి శిరస్సు వంచి నమస్కరించారు. గాంధీ మందిరం తరపున నిర్వాహకులు చిరు జ్ఞాపిక తో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన దూరదర్శన్ తో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధితో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఉన్న సహజ వనరులు సక్రమంగా వినియోగించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు.. సాగునీరు.. త్రాగునీరు సమస్య లేకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జలజీవన్ మిషన్ ద్వారా అన్ని గ్రామాలకు త్రాగునీరు అందిస్తున్నామని చెప్పారు.. పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం కేంద్రంలో మాట్లాడి నిధులు తీసికొని వచ్చి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.. అంతకన్నా ముందు చాయ్ పే చర్చా కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా గొప్పతనాన్ని.. చారిత్రిక నేపథ్యం వివరించారు.. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు.. వివిధ వర్గాల ప్రతినిధులు.. బీజేపీ నేతలు పాల్గొన్నారు.. అనంతరం మల్లయోదుడు మరియు కలియుగ భీముడు కోడి రామ్మూర్తి నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.





# శాంతియుత గణేష్ ఉత్సవాలను నిర్వహించాలి

- **మట్టివిగ్రహాలనే పూజించండి**
- **యూత్ మీటింగ్ లను ఏర్పాటు చేసి అవగాహన కల్పించండి**
- **కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి**
- **నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరగాలి :**
- **జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**బద్వేలు, ప్రజాస్వరం**

శాంతియుత, ఆహ్లాదకర వాతావరణంలో.. వినాయక ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు శాంతి కమిటీ సభ్యులు సమన్వయ సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. జిల్లాలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై..జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన.. మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ లో శాంతి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తోపాటు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జేసీ అదితి సింగ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మత సామరస్యానికి ప్రతీకగా మన జిల్లా ప్రసిద్ధి చెందింది.. అన్ని మతాల ప్రజల సహకారంతో..అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గణేష్ ఉత్సవాలలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఉత్సవాలు విజయవంతం చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరూ మట్టివిగ్రహాలనే పూజించాలన్నారు. ఇతరులకు ఇబ్బంది కలుగకుండా ప్రభుత్వం నిర్దేశించిన మేరకు మాత్రమే సౌండ్ సిస్టం ఏర్పాటుచేసుకోవాలని ఉత్సవ నిర్వాహకులను ఆదేశించారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత భద్రతను దృష్టిలో ఉంచుకుని ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు. నిమజ్జనం జరిగే ప్రాంతంలో గజ ఈతగాళ్లను, సిద్ధంగా ఉంచాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. రిస్కీ బోట్స్ ను మేజర్ నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలనీ అధికారులను ఆదేశించారు..బారికేడింగ్, లైటింగ్, శానిటేషన్ చక్కగా ఉండాలని, అగ్నిమాపక యంత్రాలు, పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని, నిమజ్జనానికి వెళ్లే దారిలో, సమీపంలో ఉన్న మద్యం దుకాణాలను మూసివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేటాయించిన విధులను చిత్తశుద్ధి తో నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందుకు గాను ప్రణాళికాబద్ధంగా ముందస్తుగానే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నిమజ్జనం మార్గంలో కరెంట్ తీగలు, కేబుల్ వైర్ లు అడ్డు రాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉత్సవ విగ్రహాలను నిమజ్జనం చేసే ప్రాంతాల్లో క్రేన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అలాగే.. అన్ని రకాల భద్రతా ఏర్పాట్లను చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గణేష్ ఉత్సవాలకు సంబంధించి.. ఎక్కడైనా ఏవైనా సమస్యలు ఎదురైతే.. వెంటనే అధికారులకు, పోలీసు సిబ్బందికి సమాచారమివ్వలన్నారు. అనవసరమైన విషయాలను అత్యుత్సాహంతో.. సోషల్ మీడియాలలో యువత పోస్ట్ చేయడం వంటి చర్యలను అరికట్టేలా శాంతి కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు.అలాగే ముఖ్యంగా యువతకు సెన్సిటివ్ సమస్యలపై స్పెషల్ మీటింగ్ లు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు.ఇందులో యూత్ కమిటీలను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. వినాయక ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీస్ శాఖ ఇచ్చే సూచనలను తప్పక పాటించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా నిమర్జనం స్థలాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి.ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో మాత్రమే నిమర్జనం జరిగేలాగా అధికారులు చూడాలన్నారు.డివిజన్ స్థాయిలో కోఆర్డినేట్ మీటింగ్ నిర్వహించాలన్నారు. 108, మెడికల్ క్యాంపులను ఏర్పాటు వైద్యాధికారులు ఏర్పాటు చేయాలన్నారు.మట్టి విగ్రహాలపై అవగాహన కల్పించాలన్నారు.గ్రామ పంచాయతీలో ప్రాంతాల్లో వసతులు కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ శానిటేషన్ పై పూర్తి దృష్టి సారించాలన్నారు.కడప కు సంబంధించి విగ్రహ కమిటీలకు సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని పండుగలు మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకోవడం ఆనావతిగా వస్తుందన్నారు జిల్లాలో వినాయక చవితి పండుగను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తి భావంతో జరుపుకునేందుకు అందరూ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు, శాంతిభద్రతలకు, మతసామరస్యానికి ఇబ్బంది కలగకుండా వినాయక ఉత్సవాలు నిర్వహించాలన్నారు. ప్రాంతాల, వీధుల వారీగా ఏర్పాటు చేస్తున్న ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు ముందస్తుగా.. సంబంధిత అధికారుల వద్ద అనుమతులు తీసుకోవాలన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన నియమ నిబంధనలను ఉత్సవ కమిటీ సభ్యులు ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని.. శాంతి కమిటీ సభ్యులను ఎస్పీ కోరారు.సెన్సిటివ్ ప్రాంతాల్లో పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉత్సవ కమిటీ ఆర్గనైజర్స్ పూర్తి వివరాలు ఆన్లైన్ యాప్ ద్వారా అప్లై చేసుకోవాలన్నారు. అనుమతులకు సంబంధించి పోలీస్ శాఖ ఎలాంటి రుసుము వసూలు చేయడం లేదన్నారు. పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్స్ ఏర్పాటు చేస్తామన్నారు. వినాయక ఉత్సవ పందిళ్ళ వద్ద కానిస్టేబుల్, హోంగార్డు మొదలైన భద్రత సిబ్బంది పర్యవేక్షణ తప్పకుండా ఉంటుందన్నారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గణేష్ ఉత్సవాలలో పోలీసు అధికారులను ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కడపలో దాదాపు 250, ప్రొద్దుటూరులో దాదాపు 150 సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. బానెడ్ వీడియోలను అరికట్టాలన్నారు.మేజర్ ప్రాంతాల్లో డ్రోన్ గస్తీ నిర్వహించాలన్నారు. ట్రబుల్ సూటార్స్ లపై నిఘా ఉంచి బైండోవర్ చేయాలన్నారు.అన్ని మతాల వారు సహకరించి గణేష్ ఉత్సవాన్ని శాంతియుత, ఆహ్లాదకర వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాల నిర్వహణలో శాంతి భద్రతల ఏర్పాట్లపై.. పలువురు శాంతి కమిటీ సభ్యుల అభిప్రాయాలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు జాన్ ఇర్విన్‌చంద్ర మోహన్, సాయి శ్రీ,కడప కార్పొరేషన్ కమిషనర్ మనోజ్ రెడ్డి,పోలీసు అధికారులు,గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ అధ్యక్షుడు మునగా సతీష్, జనరల్ సెక్రటరీ కే.వి లక్ష్మినారాయన రెడ్డి, జిల్లా విహెచ్ పి అధ్యక్షుడు చెన్న కృష్ణా రెడ్డి, శాంతి కమిటీ సభ్యులు,వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# వరాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**జయశంకర్ భూపాలపల్లి, ప్రజాస్వరం**

వర్షాల నేపథ్యంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. ఈరోజు బుధవారం భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామంలో వర్షాలతో దెబ్బతిన్న పెద్ద చెరువు కట్ట, మత్తడి పారే రోడ్డు ప్రాంతాన్ని ఎమ్మెల్యే గ్రామ నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం భూపాలపల్లి మంజూరునగర్ లోని ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్, పీఆర్ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. కమలాపూర్ గ్రామ రైతుల కోసం గొల్లబుద్దారం దేవాదుల ప్రాజెక్టు నుండి కమలాపూర్ సాగు నీటి అవసరాల పనులను త్వరితగతిన ప్రారంభించి,పూర్తిచేసి రైతుల సాగునీటి అవసరాలను తీర్చాలన్నారు. దీంతో, పరిసర గ్రామాలైన రాంపూర్, చికెన్ పల్లి గ్రామాల రైతులకు లబ్ధి కలుగుతుందన్నారు. వర్షాల నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు అందుబాటులో ఉండాలన్నారు.



# కాళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

- **అధికార యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ..**
- **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి, ప్రజాస్వరం**

కాళేశ్వరం వద్ద గోదావరి నది నీటి మట్టం పెరుగుతుండడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసునట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కాళేశ్వరంలో గోదావరి, సరస్వతి ఘాట్ల వద్ద వరద ఉధృతిని ఎస్పి కిరణ్ ఖరే తో కలిసి పరిశీలించారు. బుధవారం ఉదయం 7 గంటలకు సి డబ్ల్యూసి నివేదిక ప్రకారం 12.220 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజల ప్రాణరక్షణలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆరోగ్య తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నది పరివాహక గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు ముందుగానే సమాచారం అందించడంతో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అత్యవసర పరిస్థితులలో సేవలు అందించడానికి ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్డీ ఆర్ ఎస్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు యంత్రాంగం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అత్యవసర సేవలకు కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన 9030632608 నంబర్ కు కాల్ చేయాలని ఆయన సూచించారు.



# రాజీవ్ గాంధీ సేవలు దేశానికే ఆదర్శం

- **మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్ద కుమార్...**

**జమ్మికుంట, ప్రజాస్వరం**

ఇల్లందకుంట మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కుమార్, ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ, 81 వ,జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూల మాలలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ, సేవలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. రాజీవ్ గాంధీ, ప్రధానిగా ఆధునికత ప్రగతిశీల సంస్కరణలు తీసుకొచ్చి దేశానికి గొప్ప మార్గాన్ని చూపారని కొనియాడారు. సైన్స్ ని ప్రోత్సహించారు., టెలికాం రంగంలో వినూత్న మార్పులు తీసుకొచ్చారు. శాంతి ప్రజాస్వామ్య విలువలకు తన జీవితాన్ని అంకితం చేశారని, ఈ దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని యువతకు అవకాశాలు కల్పించి దేశ ప్రగతికి పాటుపడాలని సంకల్పించారని. ఓటు హక్కు 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించి యువతకు గొప్ప అవకాశాన్ని కల్పించారని అన్నారు. రాజీవ్ గాంధీ,పంజాబ్ ఒప్పందం, ఇండియా మరియు శ్రీలంక ఒప్పందం వంటి శాంతి నిర్ణయాలతో ప్రపంచ మన్ననలు పొందారన్నారు. ఈ కార్యక్రమలో ఉప్పల శ్రీనివాస్ రెడ్డి, కనుమల్ల సంపత్, వంగ రామకృష్ణ, గొడిశాల పరమేశ్వర్, సింగిరెడ్డి గోపాల్ రెడ్డి, గంగారం మహేష్,పెద్ది శివకుమార్, గొడుగు మానస, మీసా రాజయ్య, భోగం సాయిరాం, తోడేటి కిషన్, బండి మల్లయ్య, మర్రి వీరారెడ్డి, గోరుకుంట్ల స్వామి, బైరెడ్డి కొండారెడ్డి, గడ్డి శ్రీనివాస్, మోతే మహేందర్, మంకు ఐలయ్య, గొట్టే రాజశేఖర్, తాడెం దిలీప్, దంసాని తిరుపతి,రావుల రాజబాబు, దార నరేష్, రేణిగుంట రవీందర్ రావుల మోహన్ రెడ్డి,ఉప్పుల మల్లారెడ్డి,ఉప్పుల శ్రీనివాసరెడ్డి, శాతాల మధు, మారేపల్లి వంశీ,జక్కు కుమారస్వామి, ఆకనపల్లి వెంకటేష్,గుండార కిరణ్, పైడిపల్లి దేవేందర్, ఎండి అజ్గర్ పాషా, దాసరి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో పలు అభివృద్ధి పనులు పై సమీక్ష

- **జిల్లా కలెక్టర్ కె. హైమవతి**

**హుస్నాబాద్, ప్రజాస్వరం**

హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపైన ఆయా మండల అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష సమావేశం ఆర్డీవో రామ్మూర్తి తో కలిసి నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. పంచాయతీ రాజ్ ఇంజనీర్ శాఖలో ఏంజిఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టిన గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడి సెంటర్స్ పనులు మొదలు పెట్టినవి పూర్తి చెయ్యాలని, మిగతా పనులు పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే కట్టడానికి స్థలం లేక జిపి, అంగన్వాడి భవనాలకు కట్టలేకపోతున్నామని అధికారులు తెలిపాగా ఎంపీడీవో, తహసీల్దార్ ఫీల్డ్ ఎంక్వైరీ చెయ్యాలి. అలాగే పిఎచ్సి, సబ్ సెంటర్ లు నిర్మాణం, మరియు మేజర్, మైనర్ రిపేర్లు సైతం వేగంగా పూర్తి చేయాలన్నారు. కోహెడ నుండి సముద్రాల పూర్తి కావచ్చిందని 15 రోజుల్లో అర్ అండ్ బి శాఖ అధికారులు పూర్తి చెయ్యాలని. జిఎస్బి, రెడ్ మిక్స్, బిటి, కల్వర్టు పనులు, అంతక్కపేట నుండి కొత్తకొండ రోడ్ సైతం వేగం పెంచాలని తెలిపారు. హుస్నాబాద్ నుండి కొత్తపల్లి 4 వరసల రోడ్ పనులకు ఇంజనీర్ అధికారులు టోకెన్ రేజ్ చెయ్యాలని, ఎలక్ట్రికల్, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అనుమతులు ఇవ్వగానే పనులు మొదలు పెట్టాలని తెలిపారు. ఎలక్ట్రిసిటీ స్తంభాలు, చెట్లు తొలగించడంలో టెండర్ ప్రొసెస్ పూర్తి చేసి మొదలు పెట్టాలని తెలిపారు. నేషనల్ హైవే పనుల్లో పోతారం, పందిళ్ల, జిల్లెళ్ళగడ్డ, సముద్రాల, బస్వాపూర్ గ్రామాల వద్ద సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చెయ్యాలని తెలిపారు. హుస్నాబాద్ టౌన్ లో 4 వరసల రోడ్ పనులు దాదాపు పూర్తి కావచ్చింది. మిగతా ప్రదేశాల్లో ఫారెస్ట్ ల్యాండ్ క్లియరెన్స్ లో వేగం పెంచాలని రోడ్ పనులు పూర్తి చెయ్యాలని తెలిపారు. మిషన్ భగీరథ మండలాల్లో తాగు నీరు అందించే పనులు సైతం చేపట్టిన పనులు పూర్తి చెయ్యాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్ మున్సిపల్ లో సిసి రోడ్స్, డ్రైనేజీ, పనులు, పందిళ్ల నుండి ఎల్లమ్మ చెరువు వరకు బిటి రోడ్ నిర్మాణం, రీడింగ్ రూమ్, కమ్యూనిటీ హోల్, ఇతరత్ర పనులలో వేగం పెంచాలని, ఎల్లమ్మ చెరువు కట్ట సుందరీకరణ పనులు, బతుకమ్మ ఘాట్ ను బతుకమ్మ పండుగ వరకు పూర్తి చెయ్యాలని మిగిలిన పనులు నిర్ణిత కాల వ్యవధిలోపు పూర్తి










చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మండలాల్లో చెరువులను ఎల్లపుడు మానిటర్ చెయ్యాలి కట్ట నాణ్యత చెక్ చెయ్యాలని నీటిపారుదల శాఖ అధికారులకు తెలిపారు. కొత్తగా నిర్మించే ఆసుపత్రి భవనం ప్లాన్ ను పక్కా ప్రణాళికతో నిర్మాణం జరగాలని ఇంజినీరింగ్ అధికారులకు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు శాంక్షన్ అయిన లబ్ధిదారులు వేగంగా నిర్మాణం పూర్తి చేయాలని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఆయా స్థాయిలో ఏఈ హౌసింగ్ విసిట్ చేసి పేమెంట్ త్వరగా వచ్చేలా చూడాలని తెలిపారు. నిర్మాణం సుముఖంగా లేని వారి నుండి లేటర్ తీసుకుని పేరు తొలగించాలి. పిఎం ఏవై, యాప్ లో శాంక్షన్ అయిన వాటిని అప్లోడింగ్ ప్రక్రియ సైతం పూర్తి చెయ్యాలనీ ఎంపిడిఓ మరియు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. వనమహోత్సవ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు సిఏ బ్లాక్ ప్రాంతాల్లో ఇచ్చిన టార్గెట్ ను పూర్తి చెయ్యాలి. విఐపి ప్లాంటేషన్, ఇతర మొక్కలను ఎల్లపుడు మానిటర్ చెయ్యాలని తెలిపారు. విద్యా సంస్థలు, రోడ్ వెంబడి, హెల్త్ సెంటర్లలో మొక్కలు లక్ష్యం ప్రకారం పూర్తి చెయ్యాలి. వనమహోత్సవము బాగంగా రోడ్ కి ఇరువైపుల చెట్లు నాటే కార్యక్రమం ఆయా శాఖల అధికారులు సైతం వేగం పెంచాలి. మున్సిపల్ లో వనమహోత్సవం టార్గెట్ సైతం పూర్తి చెయ్యాలి. రోడ్ వెంబడి రావి, మర్రి, వేప లాంటి చెట్లు పెంచాలి. ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం పూర్తి కాగానే తులసి, మునగ, జామ, కరువే పాకు, నిమ్మ చెట్లు పంపిణీ చెయ్యాలి. ఇంజనీరింగ్ కళాశాల సంబంధించి విద్యార్థులకు హాస్టల్ వసతి గురించి బాయ్స్, గర్ల్స్ కు గవర్నమెంట్ హాస్టల్ అందించే ప్రక్రియ గూర్చి చర్చించారు.

# నాణ్యత ప్రమాణాలు లేక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వాటర్ ప్లాంట్లు

- **కఠిన చర్యలు తప్పవు**
- **మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్..**

**జమ్మికుంట, ప్రజాస్వరం**



ప్రజలకు అనువుగా ఉండేందుకు జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో వాటర్ ప్లాంట్ లను ఏర్పాటు చేసుకున్నారని, నాణ్యత ప్రమాణాలు లేకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వాటర్ ప్లాంట్ లపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, అన్నారు. బుధవారం జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని జయశ్రీ వాటర్ ప్లాంట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు నాణ్యమైన తాగు నీరు అందించాలని ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ లోని క్యాన్లు 90రోజులకు ఒకసారి మార్చాలని, నీటిలో ఎంత శాతం క్లోరిన్ కలపాలో కూడా తెలియని షాప్ లోని వర్కర్లను షాప్ లలో ఉంచుతున్నారని, క్యాన్ లో పురుగులు ఉంటున్నాయని కమిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు ఇచ్చి రోగాలను తెచ్చుకుంటున్నామని, ఇటువంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మున్సిపాలిటీ పరిధిలో 25 వాటర్ ప్లాంట్ లు ఉన్నాయని, వాటిని తనిఖీ చేస్తామని ఆయన అన్నారు. షాప్ లైసెన్స్ ల గడువు ముగిసిన రెన్యువల్ చేసుకోవడంలో అలసత్వం వహిస్తున్నారన్నారు. కొన్ని ప్లాంట్ లలో క్లోరిన్ కు బదులుగా బ్లీచింగ్ కలుపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వర్షకాలంలో ప్రజలు ఎల్లప్పుడూ మిషన్ భగీరథ నీటిని కానీ, ప్లాంట్ లో కొన్న నీటిని కానీ కాచి చల్లార్చి తాగాలన్నారు. ప్రజలు తాగే ప్రతి నీటిని కాచి చల్లార్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తక్షణమే వాటర్ ప్లాంట్ లైసెన్స్ రెన్యువల్ చేసుకొని వారు చేసుకోవాలని, బి.ఎస్.ఐ. సర్టిపై ఉన్న క్లోరిన్ నే కలపాలన్నారు. తొందర్లోనే అన్ని షాపులు తనిఖీలు చేస్తామని, ప్రజలకు హాని కలిగించే వాటర్ ప్లాంట్ లను సీజ్ చేస్తామని, షాప్ లోని వర్కర్ లకు కానీ, యజమానులకు కానీ క్లోరిన్ ఎంత మేరకు కలపాలో తెలిసి ఉండాలన్నారు. అనంతరం గణేష్ హోల్ సేల్ షాపును తనిఖీ నిర్వహించారు. అందులో అమ్మే పలు వస్తువుల గడువు కాలం పరిశీలించి, బ్యాన్ అయిన ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించడంపై ఫైన్ వేశారు. పట్టణంలో బ్యాన్ అయిన ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని, ప్రజలు జమ్మికుంటను ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీ గా తీర్చి దిద్దడంలో సహకరించాలని కమిషనర్ మహమ్మద్ అయాజ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ లు మహేష్, సదానందం, ఈఈ శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది తో పాటు పలువురు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ, జయంతి వేడుకలు



**జమ్మికుంట,ప్రజాస్వరం**

మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 80వ, జయంతి సందర్భంగా జమ్మికుంటలో మండల కాంగ్రెస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్, ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తాలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా దేశిని కోటి, సుంకరి రమేష్, .పొన్నగంటి మల్లయ్య, మాట్లాడుతూ స్వర్గీయ రాజీవ్ గాంధీ, ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కమ్యూనికేషన్ రంగంలో సాంకేతిక రంగంలో మన దేశానికి విదేశీ పెట్టుబడులు లాంటి అనేకమైన సంస్కరణలు తీసుకవచ్చి దేశ అభివృద్ధి దేశ పురోగతిని చక్కదిద్దారని 21 సంవత్సరం ఉండబడిన ఓటు హక్కును 18 సంవత్సరాలకే కుదించారని. భారతదేశం కోసం అనేకమైన కార్యక్రమాలు నిర్వహించారని చివరికి దేశం కోసమే ప్రాణాలర్పించారన్నారు. అలాంటి గొప్ప కుటుంబం రాజీవ్ గాంధీ కుటుంబం అని వారి మాతృమూర్తి స్వర్గీయ ఇందిరా గాంధీ, కూడా దేశం కోసం ప్రాణాలర్పించారన్నారు. 2004 & 2009లో దేశ ప్రధానమంత్రిగా రాహుల్ గాంధీ,కి అవకాశం వచ్చిన పదవులు ముఖ్యం కాదు ఈ దేశ ఆర్థిక వ్యవస్థ బాగుండాలని ఒక ఆర్థికవేత్త అయిన మన్మోహన్ సింగ్, ను రెండుసార్లు ప్రధానమంత్రిగా చేసి భారతదేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దారని మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ, కుటుంబం దేశం కోసం ప్రాణాలర్పించారని. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి పదవిని త్యాగం చేశారన్నారు. ఇలాంటి కుటుంబం కోసం వారి ఆశయాలను వారి ఆశ సాధనల కోసం మనందరం కలిసికట్టుగా కాంగ్రెస్ యువ నాయకులు సైనికులుగా పనిచేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు బొంగోని వీరన్న, ఎలగందుల స్వరూప, శ్రీహరి, శ్రీపతి నరేష్, దిడ్డి రాము, మార్కెట్ డైరెక్టర్ రాజేశ్వరరావు, సూర్య, .కాంగ్రెస్ నాయకులు పర్లపల్లి నాగరాజ్, ముద్దమల్ల రవి, పంజాల అనిల్, ఎండి సలీంపాషా, పిడుగు భాగ్యలక్ష్మి, కుదాడి తిరుపతి, మర్రి రామ్ రెడ్డి, అశోక్, భాస్కర్,.ప్రవీణ్, .తిరుపతి, శ్రీనివాస్, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు..



# కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సిఎస్, డిజిపిలతో వీడియో సమావేశం

**అమరావతి, ప్రజాస్వరం:**

నూతన క్రిమినల్ చట్టాల పటిష్ట అమలుకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఢిల్లీ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మరియు డిజిపి హరీశ్ కుమార్ గుప్తాలతో వీడియో సమావేశం నిర్వహించారు.మన దేశంలో కొత్త క్రిమినల్ చట్టాలు అనగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత మరియు భారతీయ సాక్ష్య అధినియం అనే చట్టాలు పాత క్రిమినల్ చట్టాలైన ఇండియన్ పీనల్ కోడ్(IPC),క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (CrPC), మరియు ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ ల స్థానే అమలులోకి వచ్చాయి.ఈనూతన క్రిమినల్ చట్టాలను క్షేత్ర స్థాయిలో పటిష్టవంతంగా అమలు చేసేందుకు వివిధ పోలీస్ స్టేషన్లు, కోర్టులు,జైళ్ళు,ఫోరెన్సిక్ లేబరేటరీల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై ఆయన చర్చించారు.ఈసందర్భంగా హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ మాట్లాడుతూ ఫోరెన్సిక్ ఇకో సిస్టమ్ ను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని దానిలో భాగంగా ప్రస్తుతం ఉన్న ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీలను మరింత పటిష్టంవంతం చేయాలని ఆదిశగా తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్,డిజిపిలకు సూచించారు. వాటిలో వివిధ ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హులైన వారిని కాంట్రాక్టు విధానంలో భర్తీ చేయాలని చెప్పారు.నూతన క్రమినల్ చట్టాల అమలులో ఎపి దేశానికి రోల్ మోడల్ గా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సిఎస్,డిజిపిలకు సూచించారు.నేరం జరిగిన ప్రాంతాల్లో అనగా సీన్ ఆఫ్ అఫెన్స్ లో పూర్తిగా ఆడియో వీడియో చిత్రీకరణ చేయాలని,అన్ని ఎఫ్ఐఆర్లను ఇసాక్ష్యంలో పొందుపర్చాలని డిజిపికి హోంశాఖ కార్యదర్శికి గోవింద్ మోహన్ సూచించారు.నూతన క్రిమినల్ చట్టాల పటిష్ట అమలుకు సంబంధించి కోర్టు రూములు,జైళ్ళు, ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీలు,ప్రభుత్వ కార్యాలయాల,బ్యాంకులు తదితర చోట్ల వీడియో కాన్ఫరెన్సింగ్ విధానం అందుబాటులో ఉండేలా చూడాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సిఎస్,డిజిపిలకు సూచించారు.అలాగే ట్రైనింగ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్,జీరో ఎఫ్ఐఆర్, ఇఎఫ్ఐఆర్,మానిటంరింగ్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్,వివిధ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీల ఆధునికీకరణ,తగిన సిబ్బంది ఏర్పాటు,సిటిజన్ సెంట్రిక్ ప్రొవిజన్స్ అయిన ఎస్ఎంఎస్,ఇమెయిల్ సేవలను సిసిటిఎన్ఎస్తో ఇంటిగ్రేషన్,ఫిర్యాదుదారులకు ఎస్ఎంఎస్ అలెర్టులు పంపించడం వంటి అంశాల్లో ఎపి పోలీసులు చేపట్టిన ఎపి పోలీస్ సేవా,సిటిజన్ పోర్టల్,శక్తి యాప్ వంటి వినూతన్న చర్యలను హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ప్రశంసించారు.